# "మీ మేలు మర్చిపోను!"




నాలుగున్నర గంటల సాయంత్రం నాలుగంచులు నిండిన యౌవ్వనం వలె విడిసిపడుతోంది.

ఇంటిముందు కొబ్బరిచెట్ల నీడన పడకకుర్చీ వేసికొని కాలేజి లెక్చరరు షణ్ముఖరావు మెట్రిక్ పరీక్ష పేపర్లు దిద్దుతున్నాడు. అయిదేళ్ళ ప్రాయంగల అతని ఒక్కగానొక్క కూతురు వరం

డాలో రబ్బరుబొమ్మలతో ఇష్టమొచ్చినట్టు ఆడుకుంటోంది. సూర్యుని తెల్లని కాంతి కొబ్బరిఆకుల్లోంచి తప్పించుకొని వరండాపై పొడలు పొడలుగా పడుతోంది.

ఆరోజు ఆదివారం. ఉదయంనుంచీ షణ్ముఖరావు నిర్విరామంగా పేపర్లు దిద్దుతూనే ఉన్నాడు. ఆరోజు రాత్రికే పూర్తిచేసి, మరునాడు మొత్తం పేపర్లు పంపించి, చేతులు కడుక్కొని కూర్చోవాలని అతని పట్టుదల. పదేళ్ళ సర్వీసులో అత నెప్పుడూ విధినిర్వహణలో కనురెప్ప వాల్చలేదు; ఉద్యోగధర్మంలో తప్పటడుగు వేయలేదు. జీవితాన్ని నిర్దుష్టమైన కొన్ని నియమాల చట్రంలో బిగించి, ఆదర్శాల రహదారిలో ఒడుదుడుకు ల్లేకుండా నడిపించి — శాంతినీ, సార్థకతనూ పొందుదామనే ఆశయం గలవాడు. ఉద్యోగానికీ, ధర్మానికీ అక్షరాలా కట్టుబడి; నిప్పులా వుండే వ్యక్తి; ధనవ్యామోహం లేదు. సాంఘిక విలువ పట్ల ఆసక్తిలేదు; బ్రతుకు హోదాపై మోజులేదు అతనికి. ఉద్యోగధర్మానికి మించిన విలవా, ధ్యేయమూ, జీవితమూ లేవు. విద్యార్థులకు ట్యూషన్లు చెప్పడు. తనకొచ్చిన విద్యను గరపడంలో క్షణం పాటు వొళ్ళు దాచుకోడు. పదిగంటలకు పావుగంట ముందుగానే కాలేజీకి వెళ్ళి, నాలుగు గంటలకు అరగంట ఆలస్యంగానే ఇంటికి వస్తాడు. 'కొరకరాని కొయ్యలాంటి లెక్చరరు' అంటారు విద్యార్థులు. 'మరీ ఉద్యోగధర్మమంటూ ఉద్యోగానికి జలగలాగ అంటుకు పోతాడు' అంటూ తోటి లెక్చరర్లు ఎగతాళి చేస్తూంటారు. కాని 'నిజమైన ఉద్యోగస్థుడు' అంటాడు ప్రిన్సిపాల్. తనని గురించి ఎవ రెల్లాంటి వ్యాఖ్యానాల్ని విసరినా మ్యాథమాటిక్స్ లెక్చరరు షణ్ముఖరావుకు చీమకుట్టినట్లుండదు.

పడకకుర్చీలో కూర్చుని దీక్షగా పేపర్లు దిద్దుతూన్న షణ్ముఖరావు కాళ్ళపైన ఏవో చేతులు పడగా ఉలిక్కిపడి ముందుకు చూశాడు. ఎదురూగ్గా, ఎవరో, ఎప్పుడూ చూడనివ్యక్తి, గడ్డం మాసి ఉంది. వేసుకున్న దుస్తులు బీదరికానికి చిహ్నాలుగా ఉన్నాయి. కళ్ళు అంతులేని అగాధాన్ని తెలుపుతున్నాయి. కొంచెం బొద్దుగా వున్నా, మనిషి బాధలబరువుతో తీసుకుపోయినట్టు తోస్తూంది.

"బాబూ! నన్ను రక్షించండి. నా బ్రతుక్కి భిక్ష పెట్టండి. మిమ్మల్ని నమ్ముకొని వచ్చాను;" బావురుమన్నాడా వ్యక్తి.

"ఏమిటోయ్; లే, లే! ఎవరు నువ్వు? ఎందు కొచ్చావ్? ఈ విపరీత మేమిటి? నా కాళ్ళు పట్టుకొనే కష్ట మేమొచ్చింది నీకు?" అన్నాడు షణ్ముఖరావు ఆశ్చర్యంతో కనుబొమలు ముడుస్తూ.

"నన్ను లక్ష్మణమూర్తి అంటారండీ! నేను కంపెనీలో గుమాస్తానండీ! నా

కింకా పెళ్ళి కాలేదు. కాని నాపై బోలెడు సంసారభార మున్నదండి. రోగిష్టి ముసలితల్లిని పోషించాలండి. అంతేగాకుండా మొగుడు పోయిన మా అక్కా, ఆమెకుగల ముగ్గురు పిల్లలూ! వాళ్ళకుకూడా నేనే దిక్కండి! కాని ఈ దిక్కులు తెలియనివాడికి మీరే పెద్ద దిక్కండీ! మీ పైన కొండంత ఆశతో వచ్చాను. నేను మూడుసార్లు మెట్రిక్ పరీక్షకు కూర్చున్నాను. మూడుసార్లూ మ్యాథమేటిక్స్‌లోనే తప్పాను. ఈసారి ప్యాసు కాకపోతే ఉద్యోగం వూడుతుం దని కంపెనీ ప్రొప్రైటరు గట్టిగా చెప్పా డండి. ఈతడవకూడా లెక్కల్లోనే శని దేవత నా నెత్తిన కూర్చున్నదన్న భయం వుందండి. నా ఉద్యోగం మీ చేతుల్లో ఉంది. నా బ్రతుకు మీ చేతుల్లో ఉంది. నాపై ఆధారపడిన దిక్కులేని పక్షుల బ్రతుకులు మీ చేతుల్లో ఉన్నాయి. నా ఒక్కడికి మీరు సహాయం చేస్తే ఆరుగురు గల కుటుంబానికి సహాయం చేసినవా రవుతారు. నా నెంబరు 2313 అండీ!..." అన్నా డతను దీనాతి దీనంగా, ప్రాణాన్నంతా మాటల్లో పొదివిపట్టుకొని.

షణ్ముఖరావు కనుబొమలు తీవ్రంగా ముడిచాడు. అతని కడుపులో కోపం 'ఇంతకు అంతై, అంతకు మరింతై' అన్న రీతిన ప్రజ్వరిల్లుతోంది.

"ఏయ్! మిష్టర్! గెటవుట్! నా దగ్గర ఇట్లాంటి వేం సాగవు. హరిహర బ్రహ్మాదులు దిగివచ్చి అరమార్కు పెచ్చు వేయమన్నా వేయను. నీతీ న్యాయాల బలంతో ఈ ఉద్యోగం చేస్తు న్నాను. అవి తప్పిననాడు నా బ్రతుకే వృధా. వెళ్ళు! వెళ్ళు!!" ఖంగుమనే కంఠంతో గర్జించాడు షణ్ముఖరావు.

లక్ష్మణమూర్తి కంట తడి పెట్టాడు. కన్నీళ్ళను చెంపలక్రిందకి జార్చాడు. కడుపులో ప్రేగులు బయటికొచ్చేట్టు ఏడ్చాడు. ఎంతో బ్రతిమిలాడాడు. ససే మిరా వీల్లేదని షణ్ముఖరావు రోకలి బద్దలుకొట్టి చెప్పాడు.

అయిదేళ్ళ ప్రాయంగల షణ్ముఖ రావు కూతురు అనిల ఆ చోద్యాన్నంతా చూస్తూ వరండాలో కొంతసేపు నిల బడింది. తర్వాత ఏమనుకుందో ఏమో, ఒకచెంపన తల్లి పిలుస్తూన్నా విని పించుకోకుండా బజారులోకి పరుగెత్తింది ఆడుకొనేందుకు. షణ్ముఖరావు చూసీ చూడనట్టు పట్టించుకోలేదు.

లక్ష్మణమూర్తి దిగులుగా ముఖం వ్రేళ్ళాడవేసికొని బయటకు వెళ్ళాడు.

అస్తమించే సూర్యునిచుట్టూ చేరిన మబ్బులు నెత్తురు గడ్డ చిందినట్లు భయం కరంగా నవ్వుతున్నాయి.

షణ్ముఖరావు మళ్ళీ పేపర్లు దిద్దేం దుకు ఉపక్రమించాడు.

"ఏమండీ! వీధిలోకి అమ్మాయి పరుగెత్తింది. కాస్త వెళ్ళి తీసుకురా

కూడదూ! లారీలూ, కార్లూ తిరుగుతూ వుంటాయి," అంటూ ఆతని భార్య ఇంట్లోంచి వరండాలో కొచ్చింది.

ఆ క్షణంలోనే వీధిలో లారీకి సడన్ బ్రేకులు పడ్డ శబ్దం - భయంకరమైన రాక్షసి నరమాంసాన్ని తృప్తిగా తిని త్రేన్చినట్టుగా వినవచ్చింది. నాలుగు వైపులనుంచీ జనం పరుగెత్తుకొచ్చిన చప్పుడూ, 'ఎవరో లారీక్రింద పడ్డారు; అయ్యో పాపం!' అన్న కేకలూ విన వచ్చాయి.

షణ్ముఖరావు భార్య మొహంకేసి ఆందోళనగా చూశాడు. అప్పటికే ఆమె మొహాన సూర్యుడు సంపూర్ణంగా నిష్క్రమించాడు.

షణ్ముఖరావు కుర్చీలోంచి లేచి గబ గబా వీధిలోకి వచ్చాడు. అతని మనస్సు పెనుగాలికి గురైన గడ్డిపోచ వగిది రెప రెప లాడుతోంది. అతని ఇంటికి పది గజాల దూరంలో లారీ ఆగి వున్నది. చుట్టూ జనం మూగారు. ఆ జనంలోకి షణ్ముఖరావు జొరబడ్డాడు. ఆ దృశ్యం చూసేసరికి అతని కళ్ళు వెళ్లుకొచ్చాయి. లారీ ముందుచక్రాల క్రింద లక్ష్మణ మూర్తి. అతని చేతులకు గజం దూరంలో అనిల. తన కూతుర్ని రక్షించబోయి అతను లారీక్రింద పడ్డాడన్నమాట!

షణ్ముఖరావు గబ గబా తన కూతుర్ని ఎత్తుకున్నాడు. ఆ పిల్లకు పెద్దగా దెబ్బలు తగల్లేదు.

అక్కడ చేరిన జనంలో నలుగురు ధైర్యస్థులు లక్ష్మణమూర్తిని లారీ క్రింద నుంచి తీసి రిక్షామీదకు ఎక్కించారు. అతని కుడికాలు లారీ చక్రం క్రింద బడింది. మోచేతులూ, మొహం దోక్కు పోయాయి. కుడికాలుమడమకు పండిన టోమోటో చితికిన ట్లయింది. నెత్తురు కాలువలు కడుతోంది. అట్లాగే అతన్ని గవర్నమెంటు హాస్పటల్‌కు చేర్చారు.

వాడిపోయిన మందార పువ్వులాగ ముడుచుకుంది మునిమాప.

మ్యాథమేటిక్స్ లెక్చరరు షణ్ముఖ రావు గవర్నమెంటు హాస్పటల్‌కు వెళ్ళాడు. లక్ష్మణమూర్తిని బెడ్‌పై పడుకోబెట్టారు. ఆక్సిజన్ పెట్టారు. కుడికాలుకు కట్టుగట్టారు. ఇంజక్షన్లు ఇచ్చారు. ఛీఫ్ మెడికల్ ఆఫీసరు ఆ కేసును గురించి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నాడు.

లక్ష్మణమూర్తిని చూడగానే షణ్ముఖ రావు హృదయం ఎండను చూసిన మంచు గడ్డ అయింది. పాపం! ఒక బాలిక ప్రాణాన్ని కాపాడేందుకు తన ప్రాణాన్ని లక్ష్యపెట్టలేదు. అదే నిజమైన మానవత్వం! నిస్వార్థమైన సేవ! అతనితో మాట్లాడి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు, తన ఒక్కగానొక్క కూతుర్ని రక్షించి నందుకు.

"మాష్టారూ! నన్ను మర్చిపోకండి. నేను లెక్కల్లో ప్యాసయేట్టు చూడండి.



మీ మేలు మర్చిపోను," అన్నాడు లక్ష్మణమూర్తి పేలవంగా ఆ స్థితిలో.

షణ్ముఖరావు గుండెను తుప్పుకత్తులతో కెలికినట్లయింది. 'ఊఁ' 'ఆఁ' అనలేక మౌనంగా ఇంటికి వచ్చాడు.

ఆ రాత్రి షణ్ముఖరావు చేతులు భోజనం పళ్ళెంపై వాలలేదు. కనురెప్పలపై నిద్ర కన్నెత్తికూడా చూడలేదు. తల్లిపక్కలో అనిల నిశ్చింతగా, నిర్మలంగా నిద్రబోతోంది.

తనకీ లక్ష్మణమూర్తికీ గల వ్యత్యాసాన్ని తైపారువేసికొని చూసుకున్నాడు షణ్ముఖరావు. అతనికి లెక్కలపేపర్లో మార్కులు వేయుటమా? వేయక పోవడమా? అతను ప్రాణాలకు తెగించి తన కూతుర్ని రక్షించాడు. అందులో అతనికి స్వార్థం లేదు. తను అర్థించిన సహాయాన్ని నిరాకరించిన కఠినహృదయుని కూతుర్నే రక్షించాడు, తనకు జరుగబోయే ప్రమాదాన్ని ఖాతరు చేయకుండా. అతనిలో మానవత్వం, కరుణాభావం, సేవాతత్పరతా మూర్తీభవించిఉన్నాయి. కాని తనలో ఎదుటవాడి కష్టాల్ని అర్థం చేసికొని, సానుభూతితో సహాయం జేసే మానవత్వం లేదు. ఆ కరుణాదృష్టి లేదు. సేవాపిపాస లేదు. తను ఉద్యోగ

ధర్మానికి అక్షరాలా కట్టుబడి ఉన్నాడు. దానివల్ల తను ఆత్మసంతృప్తిని పొంద వచ్చు. కాని అంత కఠినమైన, పాషాణ సదృశమైన ఉద్యోగధర్మాన్ని నిర్వర్తించి ఏం ప్రయోజనం? తను వ్యక్తిత్వ ధర్మం కోసం సహాయార్థియై వచ్చిన వానిని నిర్మోహమాటంగా బయటకు గెంటటం గొప్పా! అతను సేవాభిలాషతో ఒక పాపను ప్రాణాలకు తెగించి రక్షించడం గొప్పా? నిజంగా అతని త్యాగమే, శీలమే గొప్పది తను నీతి నిజాయితీలను పోషించడంలో నిప్పులా వున్నాడంటే- అంది స్వకీయమైన విషయము ఒకరకంగా తను స్వార్థం చూసుకుంటున్నాడు. పేరుకోసమే, ఆత్మ సంతృప్తికొరకే అంత కఠినాత్ముడిగా మారాడు. అతని మానవతాధారం విశ్వజనీనమైంది. ఆ రాత్రంతా షణ్ముఖరావు కంటికి రెప్పలు దూరం కాగా, ఆలోచిస్తూనే గడిపాడు. 'మీ మేలు మర్చిపోను' అని లక్ష్మణమూర్తి అన్న మాటలు అతని మనోమందిరంలో నిర్విరామంగా ఘంటలు కొడుతూఉన్నాయి.

తెల్లవారిఝామునే లేచాడు షణ్ముఖరావు. కాలకృత్యాల పిమ్మట పేపర్లు దిద్దేందుకు కూర్చున్నాడు. రాత్రి ఆలోచనల్లో అతని మనస్సు కొంత పరిష్కార మార్గం తోచింది. ముందుగా లక్ష్మణమూర్తి పేపర్నే తీశాడు - నెం. 2313. ఒకసారి పేపరంతా పైపైన చూశాడు. రెండోసారి మార్కులు వేశాడు. మొత్తం కూడాడు; ప్యాసుమార్కు రాలేదు. ఏడు మార్కులు కలిపాడు, ఏడుకొండలవాణ్ణి తల్చుకొని. ఆ క్షణంలో అతని చేతులు అప్రయత్నంగా వొణికాయి. తను ఉద్యోగ ధర్మం తప్పాడు. విధి నిర్వహణలో చేయి జారాడు. హృదయప్రేరణతో పెచ్చు మార్కులు వేశాడు. ఉద్యోగంలో అన్యాయానికి పాల్పడ్డట్టే! తర్వాత ముసురుకున్న ఆలోచనలతో షణ్ముఖరావు అరగంటవరకూ తేరుకోలేదు.

......త నింకా ఈ ఉద్యోగానికి అర్హుడు కాడు. ధర్మం తప్పాక, విధిని నిర్వర్తించలేకపోయాక ఉద్యోగాన్ని నిర్వహించడం పాపంతో సమానమే! కలుషాత్మతో జీవించడంకంటె సత్వర ప్రాయశ్చిత్తమే శ్రేయస్కరం!

వెంటనే షణ్ముఖరావు కాగితం కలం తీసికొని లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు. తొమ్మిదిన్నర గంటలకు కాలేజీకి వెళ్ళి ఆ రాజీనామా



పత్రాన్ని ప్రిన్సిపాల్‌కు సమర్పించాడు. అప్పు డతని మనస్సు తామరాకుపై నీటి చుక్కవలె తేటబడింది. జ్యోత్స్నవీచిక పగిది తృప్తిదీరా చిరునవ్వు నవ్వుకున్నాడు.

పదిగంటలకు షణ్ముఖరావు గవర్నమెంటు హాస్పటల్‌కు బయలుదేరాడు— "నిన్న ప్యాసు చేశాను" అని లక్ష్మణమూర్తికి చెప్పడానికి.

హాస్పటల్ ఆవరణలో రిక్షా దిగి, అతని గదిముందుకు షణ్ముఖరావు వెళ్ళేసరికి— లోపల్నుంచి ఇద్దరు స్త్రీలూ, ముగ్గురు పిల్లలూ ఏడుస్తూన్న ధ్వని వినబడింది. అతని గుండె ఝల్లుమన్నది. అప్పుడే స్ట్రెచర్‌పైన తెల్లగుడ్డ కప్పబడినశవం బైటికి తీసుకొనిరాబడింది.

"ఎవ రతను?" అన్నాడు షణ్ముఖరావు నిముషానికి నూటపన్నెండుసార్లు కొట్టుకుంటూన్న గుండెతో.

"నిన్న సాయంకాలం లారీ క్రింద పడ్డ అభాగ్యుడు! ఇవాళ ఉదయమే మరణించాడు పాపం," అన్నది అక్కడున్న నర్సు.

———